www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 31 మార్చి 2024



ఏమిటీ గుస గుస గుస
చంద్రబాబు చెవిలో చెబుతున్న కోలా, ఆసక్తిగా బొజ్జల సుధీర్

నాయుడుపేట సభలో

అభివృద్ధి చేసి చూపిస్తా..!

ప్రజాగళం సభల్లో చంద్రబాబు

- ట్రై సిటీలుగా తిరుపతి, నెల్లూరు, చెన్నయ్
- విద్యా, పారిశ్రామిక హబ్‌గా శ్రీకాళహస్తి
- నాయుడుపేటకు ఐటి క్లబ్

టిడిపి గ్రూపుల పోరు నేపథ్యంలో బాబును కలిసిన ఆదిమూలం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, నాయుడుపేట

తిరుపతి, నెల్లూరు, చెన్నయ్‌లను ట్రైసిటీలుగా తీర్చిదిద్దుతానని, ఈ లక్ష్యంతోనే నెల్లూరు - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు రూపకల్పన చేశానని, కృష్ణపట్నం ఓడరేవు, రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశానన్నారు. శ్రీకాళహస్తిని విద్యా పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతానని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ ఇచ్చారు. శనివారం తిరుపతి జిల్లా నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో ప్రచార సభలు జరిగాయి. ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో టిసిఎల్, సెల్కాన్, కార్బన్, జీహో పరిశ్రమలు వచ్చాయన్నారు. తిరుపతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా చేసేందుకు ఐఐటి, ఐజర్ విద్యాసంస్థలను తీసుకొచ్చామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కమీషన్లకు కక్కుర్తిపడి పరిశ్రమలను తరిమేసే స్థాయికి వచ్చారన్నారు. జగన్ కాలనీలపేరిట ఇంటి స్థలాల విషయంలో ఆరువేల కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపించారు. నయా పైసలతో వసూలు చేస్తానన్నారు. జగన్‌పెద్ద సైకో అయితే, బియ్యపు రెడ్డి చిన్న సైకో అని ఎద్దేవా చేశారు. గుడిని, గుడిలో లింగాన్ని మింగేసే రకమన్నారు. శ్రీకాళహస్తిలో బియ్యపురెడ్డి చేసిన అవినీతి అక్రమాలన్నింటినీ వెలికి తీస్తామన్నారు. శ్రీకాళహస్తి ఎంఎల్ఎ అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డిని, ఎంపి అభ్యర్థిగా వరప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, జనసేన వినుత, కోలా ఆనంద్ పాల్గొన్నారు.

నాయుడుపేటకు ఐటి క్లబ్ వరం

నాయుడుపేట బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సూళ్లూరుపేట టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం, ఎంఎల్ఎ అభ్యర్థి నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ప్రజాగళం సభ జరిగింది. నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నాయుడుపేటకు ఐటి క్లబ్‌ను తీసుకొస్తానన్నారు. రాష్ట్రంలో 13 లక్షల కోట్లు అప్పు చేశారని, ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టు పెట్టారని, అన్నా క్యాంటీన్లను కూల్చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలు తమిళనాడుకు వెళ్లి మద్యం, పెట్రోల్ తెచ్చుకునే దారుణ పరిస్థితి ఉందన్నారు. రెండుసార్లు ఎంఎల్‌ఎగా గెలిచిన కిలివేటి సంజీవయ్యకు అభివృద్ధి అంటే తెలియదని, తట్టెడు మట్టి ఎక్కడైనా వేశాడా అని విమర్శించారు. వైసిపిలో స్మగ్లర్లకు, రౌడీలకు సీట్లు కేటాయించి దౌర్జన్యంతో గెలవాలని ఆలోచిస్తే ప్రజలు ఒప్పుకోరన్నారు. నెలవల విజయశ్రీని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, నాయకులు శిసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, నాయుడుపేట మాజీ సర్పంచి గూడూరు ప్రభావతమ్మ పాల్గొన్నారు.

'రియల్' మాఫియా వైసీపీ నాయకులే : సిపిఎం

ప్రజాశక్తి - రేణిగుంట

'కంచె వేసేయ్... కబ్జా చేసేయ్ అంటూ సొంత పార్టీలో దొరికినకాడికి దొరికినట్లు దోచుకుంటున్న రియల్ మాఫియా భాగోతాన్ని కప్పిపెడుతూ, ఇతరులపై బురద జల్లుతున్న వైసిపి నాయకుల తీరును సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్ ఖండించారు. రేణిగుంటలో వైసిపి చేసిన కబ్జాలు ఒకటా రెండా అంటూ మండిపడ్డారు. కరకంబాడి ఎర్రగుట్టలో 44 ఎకరాలు కబ్జా చేసి మట్టి తవ్వి కోట్లు స్వాహా చేసింది, చెంగారెడ్డిపల్లి గ్రామంలో వందల ఇళ్లు కట్టి అమ్ముకున్నది, తూకివాకం పంచాయతీ నేతాజీ కాలనీ వివేకానంద కాలనీలో ఒక ప్లాట్ లక్ష నుంచి రెండు లక్షల చొప్పున పేదల నుంచి వసూలు చేసింది, ఎర్రంరెడ్డిపాలెం చెరువును వదలకుండా భూఆక్రమణ చేసింది ఎవరో చర్చకు 'సిద్ధమా' అని ప్రశ్నించారు. సిపిఎంపై బురద చల్లడం అంటే సూర్యునిపై ఉమ్మి వేయడమేనన్నారు. సిపిఎంలో చిన్నపాటి అవినీతి అక్రమానికి పాల్పడినా విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి సాహసం వైసిపి చేస్తుందా? అని సవాల్ విసిరారు. ఓ పంచాయతీ కార్మికుడు మాట్లాడుతున్న వీడియోను ప్రణాళికాబద్ధంగా వైసిపి తీయించి సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. సొంతస్థలాలు కూడబెట్టుకుంటున్నారని సిపిఎంపై దుష్ప్రచారం చేయడం కాదని, సాక్ష్యాలతో నిరూపించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు వందలాది ఎకరాలు ఆక్రమించుకుంటూ, రియల్ దందా నడుపుతున్న వైసిపిని ప్రశ్నించినందుకే సహించలేక తమపై తప్పుడు రాతలు రాయిస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు.

అలరించిన 'విరించి' ఫ్లాష్ మాబ్

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యార్థినిలు సాంకేతిక విద్యతో పాటు సాంస్కతిక సంగీత కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పరిపూర్ణ మూర్తిమత్వం పొందగలరని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి భారతి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థినులు విద్యాలయం ప్రాంగణంలో శనివారం ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. "విరించి 2కె24" సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధులుగా ఆచార్య డి. భారతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిలు విద్యుత్ తో పాటు సంగీత సాంస్కతిక నత్య కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా పూర్తిస్థాయిలో ఒత్తిడిని నివారించుకోవచ్చు అన్నారు. ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్య వి.సరిత విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కన్వీనర్ గా ఆర్. ప్రియదర్శిని, కో-కన్వీనర్ టి.పల్లవి, ఫ్లాష్ మాబ్ సంబంధించిన ఉపాధ్యాయ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సమన్వయకర్తలు వి.సరస్వతి బాయ్ (సిఎస్ఈ), కె.సుశీల (ఈసిఈ), విద్యార్థిని సమన్వయకర్త వై.ప్రశాంతి (సిఎస్ఈ), కమిటీ సభ్యులు ఎస్. మంజూష (ఈసిఈ), ఈ.బిందుప్రియ (ఈఈఈ), ఎస్. అనిత (ఎంఈ) విద్యార్థినులతో కలసి వారి ఆనందాన్ని సంతోషాన్ని సంగీతనాదములతో అలరించారు.

క్షురకుల నియామకానికి యానాదయ్య అడ్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరినందుకు తొమ్మిదిమంది నాయి బ్రాహ్మణులను తిరుమల కళ్యాణకట్ట నుంచి తొలగించారని, వారిని పున్ననియామకానికి బోర్డు ఆదేశించినా ఓ ఓటు సభ్యుడిగా, సాటి కులస్తుడిగా అడ్డుపడడం యానాదయ్యకు తగునా అని టీటీడీ మహిళా క్షురకుల వ్యవస్థాపక అధ్యక్షురాలు కె. రాధాదేవి ప్రశ్నించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన విలేకరుల సమావేశంలో నాయి బ్రాహ్మణులకు 20వేల జీతాన్ని అందిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. టిటిడి బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తొలగించిన తొమ్మిది మందిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని మాట ఇచ్చిన అమలు పరచక పోవడానికి కారణం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 110 జీవో ప్రకారం వేతనాలు చెల్లింపు జరుగుతుందని చెప్పి కార్పొరేషన్ లో ఉన్న 18 మందికి మాత్రమే జీవో ప్రకారం జీతాలు చెల్లించడంలో దాగి ఉన్న రహస్యం ఏందో బహిర్గతం చేయాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్గా కొనసాగుతున్న తొండమల్ల పుల్లయ్య తిరుమలలోని కళ్యాణకట్టలోకి వెళ్లి తిరుపతి వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా బరిలో ఉన్న భూమన అభినయ రెడ్డి ఇంటి వద్దకు రావాలని, ఎన్నికల్లో అభినయ రెడ్డి గెలుపు కోసం పనిచేయాలని కోరడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడం కాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిటిడి పాలకమండలి సభ్యుడుగా తన సొంత ప్రయోజనాలను చక్కబెట్టుకోవడానికి యానాదయ్య పని చేస్తున్నారని, నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఏమాత్రం కాదని స్పష్టం చేశారు. తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే తగిన కార్యచరణతో ముందుకెళతానని హెచ్చరించారు.

ఎస్పీడీసీఎల్ అధికారుల సేవలు ప్రశంసనీయం : సిఎండి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ జనరల్ మేనేజరుగా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదవీ విరమణ చేస్తున్న బి. వెంకట సుబ్బయ్య, కె. నరసింహారెడ్డిల సేవలు ప్రశంసనీయమని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని అనెక్స్ బిల్డింగ్ సమావేశ మందిరంలో శనివారం ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ లో వివిధ హోదాల్లో వారు నియోగదారులకు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ప్రతి ఉద్యోగి నిర్ణీత సమయం తర్వాత పదవీ విరమణ చేయాల్సిందేనని, వారి శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. జిఎం హోదాలో పదవీ విరమణ పొందిన బి. వెంకటసుబ్బయ్య, డిఈఈ హోదాలో పదవి విరమణ పొందిన కే. నరసింహారెడ్డిలు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ లో వివిధ హోదాల్లో విధుల నిర్వహణలో తమకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని సంస్థ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వీఎన్ బాబు, ఎన్వీఎస్ సుబ్బరాజు, కె. శివప్రసాద రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, డి.ఎస్. వర కుమార్, వి. సురేష్ కుమార్, పి. అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

తహశీల్దార్ ఇంట్లో ఏసీబీ దాడులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గతంలో రేణిగుంట తహశీల్దార్ గా విధులు నిర్వహించి ప్రస్తుతం కడప జిల్లాలో తహశీల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివప్రసాద్ ఇంటిపై ఏసీబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. పలు అవినీత, అక్రమాలకు పాల్పడుతున్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు నాలుగు బందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. బెంగళూరు, కడప, తిరుపతి, రేణిగుంట ప్రాంతాలలోని శివప్రసాద్ ఇండ్లు, కార్యాలయం, బంధువుల ఇళ్లల్లో శనివారం దాడులు చేశారు. రేణిగుంట లోని ఇంటి వద్ద ఎలాంటి ఆధారాలు దొరక్కపోగా, తిరుపతి పద్మావతి పురం లోని ఆయన నివాసంలో పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు, బెంగళూరులో నివాసం లో భారీ స్థాయిలో నగదును పట్టుకున్నట్లు సమాచారం. ఏసీబీ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తహశీల్దార్ శివప్రసాద్ భారీ స్థాయిలో అక్రమ ఆస్తులు కూడపెట్టినట్లు గుర్తించారు.

పామాయిల్‌తో పోషకాహార సమృద్ధి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ పామాయిల్‌తో పోషకాహార సమృద్ధి లభిస్తుందని ఉమెన్స్ యూనివర్సిటీ అసోసియేటెడ్ ప్రొఫెసర్ మీనా మెహతా తెలిపారు. యూనివర్సిటీలో జరిగిన ఓ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పామాయిల్ లో విటమిన్ ఈ, టోకోట్రినల్స్, యాంటీఆక్సిడెంట్ అధిక మోతాదులో ఉంటాయన్నారు. కాలుష్యం, రేడియేషన్ వంటి పర్యావరణ కారకాల వాల్ల శరీరంలో ఏర్పడే సెల్ డ్యామేజిని ఇవి నివారిస్తాయన్నారు. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలక వ్యాధుల ప్రమాదాన్ని అరికట్టడంలో ఇవి చాలా కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పరిశోధనలో సైతం ఇవి నిరూపించబడ్డాయని, వినియోగదారులు పామాయిల్ ను నిరభ్యాంతరంగా, ఎలాంటి అపోహాలకు తావివ్వకుండా వినియోగించవచ్చునని సూచించారు.

శివం ఏసి వర్క్స్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని గెస్ట్ లైన్ హోటల్ సమీపంలో ఉన్న శివం ఏసి వర్క్స్ వద్ద శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఏసీ వర్క్స్ నిర్వాహకుడు శివ మరమ్మతుకు గురైన వాషింగ్ మిషన్లు, ఏసీలు, ఫ్రిడ్జ్లు బాగు చేయడానికి షాపు పక్కనే వాటిని పోగు చేసి పెట్టాడు. సమీపంలోని కీర్తి న్యూరో హాస్పిటల్ వద్ద ఏర్పడిన మంటలు శివం ఏసి వర్క్స్ దుకాణం వరకు వ్యాపించింది. 20 వాషింగ్ మిషన్లు, 10 ఏసీలు ఈ అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.

ఫోటో: షాపు నిర్వాహకులకు సూచనలు చేస్తున్న అగ్నిమాపక అధికారులు.

కాంగ్రెస్ బ్యాంకు ఖాతా సీజ్ దుర్మార్గం: గోపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీలను ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తోందని, అందులో భాగమే కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను సీజ్ చేయించారని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార దాహంతో బిజెపి దిగజారుడు రాజకీయాలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీపై, ఆప్ పార్టీపై ఈడిని ఉసుగొల్పి అక్రమ కేసులను బనాయించి నేతలను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నాలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని బిజెపి కుట్ర రాజకీయాలకు తెరతేసిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఈ సమావేశంలో అబ్దుల్ మజీద్ పటేల్, మునిశోభా, షేక్ జావేద్ పాల్గొన్నారు.

కుమ్మరుల అభివృద్ధికి కలసి పనిచేద్దాం: రవికుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కుమ్మరుల అభివృద్ధికి అందరం కలిసి సమిష్టిగా పనిచేద్దామని కుమ్మరుల అభివృద్ధి సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన సమావేశంలో కుమ్మరుల అభివద్ధి సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పెట్టేటి రెడ్డెప్పను నియమిస్తూ నియామకపు పత్రాన్ని అందించారు. రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరులు రాజకీయంగా చాలా వెనుకబడిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి, నరసయ్య, వెంకటేష్, లక్ష్మయ్య, చంద్రబాబు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు : జేసీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ సమావేశ మందిరము నందు నీటిపారుదల, జల వనరుల శాఖ అధికారులతో తాగునీటి ఎద్దడి నివారణకు సంబంధించిన పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న వేసవికాలాన్ని దష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటి సరఫరా లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. నీటి సరఫరా విషయంలో ఏదైనా ఇబ్బంది ఉంటే ఎప్పటికప్పుడు సకాలంలో స్పందించి వాటిని త్వరగా పరిష్కరించేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సింగల్ విలేజ్, మల్టీ విలేజ్ పథకం ద్వారా 272 హాబిటేషన్లలో నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారి విజయ్ కుమార్, జన వనరుల శాఖ అధికారి వెంకటరమణ, డి పి ఓ రాజశేఖర్ రెడ్డి, ఎం.వి.రమణారెడ్డి ఎస్ ఈ తెలుగు గంగా ప్రాజెక్ట్, సూళ్లూరుపేట, నాయుడుపేట పుత్తూరు, మున్సిపల్ కమిషనర్లు గంగా ప్రసాద్, జనార్దన్ రెడ్డి, కె ఎల్ న్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

నోడల్ అధికారులకు కేటాయించిన ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించి ఎన్నికలు సజావుగా జరిగేలా కషి చేయాలని జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్ యం సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సార్వత్రిక ఎన్నికలు -2024 సన్నద్ధత పై నోడల్ అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, సీజర్ ఆఫ్ క్యాష్, లిక్కర్, డ్రగ్స్, మద్యం మాదకద్రవ్యాలు అక్రమ నిల్వలు తదితరాలపై చెక్ పోస్టులు, స్టాటిక్ సర్వైవలెన్స్ టీంలు, సంబంధిత ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పెంచల్ కిశోర్, అడిషనల్ ఎస్పీలు రాజేంద్ర, వెంకట్రావు, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవి కిరణ్, ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ ఆసీస్ కుమార్ పాల్గొన్నారు.

'ఎన్నికల' నజరానాలకూ 'జీఎస్‌టీ' మాయాజాలం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

ఎన్నికలంటేనే నజరానాలు, ప్రలోభాలు, వస్తువులు, నగదు పంపిణీ అని పరిపాటిగా మారిపోయింది. చీరలు, ముక్కుపుడకలు, గ్రైండర్లు, మిక్సీలు, ఫ్యాన్లు, డిన్నర్ సెట్లు, బొట్టుబిళ్లలు ఆశ చూపి ఓట్లు రాల్చుకునేందుకు బూర్జువా పార్టీల అభ్యర్థులు పథకాలు రచిస్తారు. చివరి అస్త్రంగా నగదు పంపిణీని ఉపయోగిస్తారు. ఎన్నికల బరిలో ఉన్న బూర్జువా రాజకీయ పార్టీలకు ఇది షరా మామూలే. అధికార పార్టీ మరో అడుగు ముందుకేసి కోట్లాది రూపాయల వస్తువులను రహస్య గోడౌన్ ప్రాంతాల్లో ప్రలోభాలకు సిద్ధం చేసింది. అందులో కొంత భాగం (50కోట్లకు పైగా సరుకులు) ఉన్నఫలంగా ఎన్నికల అధికారుల కంటపడడం, వాటిని సీజ్ చేయడం జరిగిపోయాయి. దానికి వక్రభాష్యాలు చెబుతూ అధికార పార్టీ నాయకులు తమ చర్యలను సమర్థించుకోవడం గమనార్హం.

ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి రెండోసారి విజయం కోసం రకరకాల ఎత్తులు వేస్తోంది. ఎలాగైనా ఈసారీ అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రధాన ప్రతిపక్షాలు సైతం ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. తిరుపతి జిల్లాలోని ఒక పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లోని ఐదు నియోజకవర్గాల్లో అధికార పార్టీ సిట్టింగ్‌లను మార్చింది. మిగిలిన రెండు నియోజవర్గాల్లోనూ ప్రజా వ్యతిరేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ప్రతిపక్ష పార్టీ నాయకులకు గాలం వేస్తోంది. మరో పక్క టిడిపి, బిజెపి, జనసేన కూటమిల్లో అనుకోకుండా కొత్త వారిని తీసుకురావడం, బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులను అభ్యర్థులుగా ప్రకటించడంతో కొంత గందరగోళ పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీటన్నిటిని అధిగమించేందుకు అసంతృప్తి నేతలకు అన్ని బూర్జువ పార్టీలు తాయిలాలు ఎరవేస్తున్నాయి. అధికార పార్టీ మరో అడుగు ముందుకేసి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు, వారికి నజరానాగా అందజేసేందుకు కొన్ని వస్తువులను కొనుగోలు చేసి, కోట్లాది రూపాయల సరుకులను సిద్ధం చేసింది. దీనికి జిల్లాలోని ఓ సీనియర్ నాయకులు బాధ్యత తీసుకున్నారు. తన నియోజవర్గంలో ప్రతి సంక్రాంతి, దీపావళి, ఉగాది, వినాయకచవితి పండుగలకు ప్రతి కుటుంబానికీ బట్టలు, టపాకాయలు, వినాయక విగ్రహాలు, క్రికెట్ కిట్లు అందజేయడంలో ఆయన దిట్ట. ఈ నేపథ్యంలో రేణిగుంట సమీపంలోని ఓ పెద్ద గోడౌన్‌లో భారీ స్థాయిలో ఫర్నిచర్, ఇతరత్రా పరికరాలను సిద్ధం చేశారు. అది ఆ నోట, ఈ నోట మారి ప్రతిపక్షాలకు తెలియడంతో వారు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంకేముంది రేణిగుంట సమీపంలోని ఆ గోడౌన్ వద్దకు చేరుకుని, ప్రతిపక్షాల ముందే వస్తువులు తరలిస్తున్న భారీ లారీని, గోడౌన్‌ను సీజ్ చేశారు. ప్రలోభాల కోసం వస్తువులు తరలిస్తూ బహిరంగంగా దొరికిన అధికార పార్టీపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. వెంటనే అప్రమత్తమైన అధికార పార్టీ, అనుభవజ్ఞుడైన నాయకుడిని రంగంలోకి దించింది. గోడౌన్‌లో 50 కోట్లకు పైగా వస్తువులు ఉన్న మాట వాస్తవమేనని, అది ఎన్నికల ప్రచారానికి చెందిన పరికరాలు, బ్యానర్లు, జెండాలు, తమ పార్టీ గుర్తు, కుర్చీలు, టేబుల్, షామియానాలు, ఇతరత్రావేనని, అవి కూడా జిఎస్‌టి చెల్లించి, బహిరంగంగా కొనుగోలు చేసిన వస్తువులేనని చెప్పారు. ఇదంత బహిర్గతమేనని, రహస్యమేమి లేదని, అధికార పార్టీపై అసత్య ప్రచారాలు మానుకోవాలని చెబుతున్నారు. అంతే ఇంకేముంది అధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సీజ్ చేసిన వస్తువుల విషయం ఎన్నికల కమిషన్‌కు తెలియజేశామని, సంబంధిత వ్యక్తులు సరైన బిల్లులు సమర్పించే దాన్ని బట్టి ఈసి నిర్ణయం తీసుకుంటుందంటూ చేతులు దులుపుకున్నారు. ఇదే కాదు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీ స్థాయిలో మద్యం సైతం స్వాధీనం చేసుకున్నారు. పనపాకం సమీపంలోని టోల్‌ప్లాజ్ వద్ద సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న 50లక్షలకుపైగా నగదు, పలు ప్రాంతాల్లో ఆధారాలు లేని నగదు, అక్రమ మద్యం, కొన్ని రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిని మావి కాదంటే మావి కాదంటూ అధికార, ప్రతిపక్ష పార్టీలు తప్పుకుంటూ ఎదుట వ్యక్తులపై విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు మాత్రం సీజ్ అయిన వాటి గురించి సరైన వివరాలు బహిర్గతం చేయకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలపై ఈసి కొరడా ఝులిపించి, ఓటర్లు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు కల్గించుకునే ధైర్యాన్ని కల్పించేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రలోబాలకు, నజరానాలకు అడ్డుకట్ట వేయాలని, పలువురు మేధావులు, ప్రజాస్వామ్య వాదులు కోరుతున్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని ఉత్తమ నెల్లూరు పంచాయతీ పరిధిలోని ఎంపీ చెరువు పాఠశాలను కోట ఎంఈఓ ధారా మస్తానయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ పాఠశాలను తనిఖీ చేసి రిజిస్టర్లు, రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని, నాడు నేడు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా ఉండడంతో ప్రధానోపాధ్యాయురాలు సుజాతను ఎంఈవో మస్తానయ్య అభినందించారు. దైవాల దిబ్బ ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం పలు ప్రశ్నలను వేసి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పలు సూచనలు, సలహాలు అందించారు.

మహిళ ఆర్థిక సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా ఆర్థిక సాధికారతపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిఎస్ఇ విభాగం లోని ఉమెన్స్ ఫోరం వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ వి సుగుణ బిఎస్ఎయం ఎమర్జెన్సీ మెడిసిన్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎలా మెలగాలి? అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళ సాధికారత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సునంద , సిఎస్ ఇ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో ఆర్డీవో కిరణ్ కుమార్, డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్లకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నుండి సంఘం థియేటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని, ఓటే వజ్రాయుధం అని పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంటుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఎల్ఐసి బ్రాంచిలో మార్చి చివరి 'ఫైనాన్షియల్ ఇయర్‌లో 105 పాలసీలు పూర్తి చేసిన ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అత్తూరు రుద్రి మోహన్‌ను బ్రాంచి అధికారులు ఏజెంట్ల యూనియన్ నాయకులు కలిసి శనివారం ఆయనకు బ్రాంచ్ మేనేజర్ భాను, అసిస్టెంట్ మేనేజర్ చేతుల మీదుగా శాలువాకప్పి, పుష్పగుచ్ఛంతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఇంకా, ఎక్కువ పాలసీలు చేసి ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించాలని ఆకాంక్షించారు. ఇందులో అసిస్టెంట్ మేనేజర్, ఏవో ఉషారాణి , లియాఫి ప్రెసిడెంట్ సి సుబ్రహ్మణ్యం రెడ్డి, ట్రెజరర్ మునిరాజా, ఆర్గనైజింగ్, సెక్రటరీ దేవరాజులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ జగన్‌దే అధికారం: భూమన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రాష్ట్రంలో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారి చేపడుతారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని 34, 44వ వారులల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, రాజేంద్ర, గీత, మునిరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి నుండి జనసేనలోకి వలసలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వైసిపి యువజన విభాగం నగర అధ్యక్షులు బండ్ల లక్ష్మీపతి రాయల్ జనసేనలో చేరారు. జనసేన కార్యాలయంలో కూటమి అభ్యర్థి ఆరని శ్రీనివాసులు కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ యువత పార్టీలోకి రావడం శుభపరిణామం అన్నారు. తిరుపతిలో ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిలు అభివృద్ధి పేరిట అరాచకం సృష్టించారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే యువతకు ఉద్యోగాలు సృష్టి, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సుభాషిణి, రాజారెడ్డి, పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయాన్ని అనుసరించాలి: టిడిపి

ప్రజాశక్తి - పిచ్చాటూరు:

సత్యవేడు నియోజకగరంలో ఆదిమూలం అభ్యర్థిత్వంపై తిరుపతిలో 'ఆదిమూలం వద్దు.. టిడిపి ముద్దు..' అనడం సరికాదని అధిష్టానం నిర్ణయాన్ని అందరూ అనుసరిం చాలని టిడిపి కార్యకర్తలు అసమ్మతి వర్గానికి సూచించారు. శనివారం సాయంత్రం పిచ్చాటూరులో ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో నాయకులు విలేకరులతో మాట్లాడుతూ. అధిష్టానం నిర్ణయం ప్రకారమే అనుసరించాలని అసంతృప్తి నాయకు లకు బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ టిడిపి మండల క్లస్టర్ డి ఇలంగోవన్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, భాస్కరన్, మాచర్ల రోశయ్య, గోవిందస్వామి, సెల్వం, పద్దు రాజు, జయచంద్ర నాయుడు, ఎమ్మెస్ రవి, రవి రెడ్డి, వాసు, శ్రీనివాసులు చిన్నా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవికుమార్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

వైసిపి తిరుపతి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా మల్లం రవికుమార్ రెడ్డి నియమితులయ్యారు. శనివారం యువజన విభాగం జిల్లా అధ్యక్షులు అజయ్ కుమార్ వైసిపి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డి సమక్షంలో ఈ మేరకు మల్లం రవికుమార్ రెడ్డికి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లం రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైసీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకాశం కల్పించిన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి ,ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలలో వైసిపి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి -కోట :

వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని కోట ఎస్ఐ నాగబాబు హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో కోట పట్టణంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలను ఎస్ఐ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. శనివారం కోట మండలంలోని లక్ష్మమ్మ గిరిజన కాలనీ, ఆర్ అండ్ బి రోడ్డు వద్ద ఆకస్మికంగా ద్విచక్ర వాహనాలను, ఆటో, కారు, వివిధ వాహనాలను క్షుణ్ణంగా పరిశీంచారు. వాహనాలకు కావాల్సిన డ్రైవింగ్, లైసెన్స్, హెల్మెట్, తదితర లాంటి ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉన్నాయా? లేదా?' అని ఆరా తీశారు. వాహనాలకు నెంబర్ ప్లేట్ ఉందా.. లేదా..?' అని తనిఖీ చేసి లేకుంటే అప్పటికప్పుడే నెంబర్ ప్లేట్ వేసుకునేలా వాహన దారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమాలకు తావు లేకుండా ఎన్నికల నిబంధనలు అమలు చేస్తున్నామని ఎస్ఐ నాగబాబు తెలిపారు.

బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్నికల నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలను బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ. వెంకట నరసింహం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఆదిలక్ష్మి గిరిజన కాలనీ ఆర్ అండ్ బి రోడ్డు వద్ద ఆకస్మికంగా ద్విచక్ర వాహనాలను, ఆటో, కారు, వివిధ వాహనాలను క్షుణ్ణంగా పరిశీంచారు. వాహనాలుకు కావాల్సిన డ్రైవింగ్,లైసెన్స్, హెల్మెట్,తదితర లాంటి ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉన్నాయా ? నెంబరు ప్లేట్లు వున్నాయా? అని ఆరా తీశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమాలకు తావులేకుండా ఎన్నికల నిబంధనలకు అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ విభాగాధిపతి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ పద్మావతి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో వ్యాయామ విభాగాధిపతి ఎం. ఉషారాణి ఉద్యోగ విరమణ మహోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ కౌన్సిల్ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి క్రమశిక్షణ, వారి శారీరిక, మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంత అవసరమో తెలుపుతూ, విద్యార్థినులలో క్రమశిక్షణ తీసుకు రావడంలోనూ, వారు అంతర్ రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీలలో తమ ప్రతిభను కనపరచడంలోనూ ఉషారాణి కృషి అసాధారణం అని ప్రశంసించారు. విశ్రాంత తెలుగు విభాగాధిపతి డాక్టర్ డిఎం. ప్రేమావతి – ఉషారాణికి పని పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడగా, డాక్టర్ కె మహదేవమ్మ తాను ఈ కళాశాల ప్రిన్సిపల్ గా ఉన్నప్పుడు ఉషారాణి ఎంతగానో సహాయ సహకారాలు అందించారని తెలిపారు. కళాశాల విద్యార్థి సంఘ కన్వీనర్ డాక్టర్ సి. భువనేశ్వరిదేవి స్పందిస్తూ పీడీగా ఉషారాణి పర్యవేక్షణలో వచ్చిన ట్రోఫీలను, ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లను గుర్తు చేస్తూ, అంకితభావంతో తమ బాధ్యతలను నిర్వర్తించే వారని తెలిపారు. ఈరోజు పదవీ విరమణ చేస్తున్న ఉషారాణి తన ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలను పంచుకుంటూ తనకు సహకరించిన, తనను ఆదరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తర్వాత వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, మిత్రులు, బంధువులు ఉషారాణి గారిని సన్మానించి వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు జాగ్రత్తగా చేపట్టాలి

రిటర్నింగ్ ఆఫీసర్ అదితి సింగ్ ఆదేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఎన్నికలు జరిగే పోలింగ్ బూత్‌ల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేపట్టాలని అధికారులనుద్దేశించి తిరుపతి ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి నగరంలోని కొన్ని పోలింగ్ బూత్‌లను శనివారం ఎలక్షన్ నిర్వహణ అధికారులతో కలిసి తిరుపతి ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ అదితి సింగ్ పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. గతంలో కొన్ని సమస్యాత్మక సంఘటనలు జరిగిన పోలింగ్ బూతులను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీస్ బందోబస్తు గట్టిగా వుండా లన్నారు. ఎస్టీవి నగర్ స్కూల్లోని 145, 146, 147 పోలింగ్ బూత్‌లను, దాసరిమఠం, గాంధీ పురంలోని వేణుగోపాల్ స్వామి స్కూల్, ఎమినెంట్ స్కూల్, మధురవాణి స్కూల్, గాంధీపురం ఎంట్రన్స్ లోని స్కూల్లోని 154,155, 156, 157,158,159,160 పోలింగ్ కేంద్రాలను, పాలిటెక్నిక్ కాలేజీలోని 52, 53, 99, 100, 101,102,103 పోలింగ్ కేంద్రాలను, దాని పక్కనే వున్న శ్రీగోవిందరాజ స్వామి హైస్కూల్లోని 108,109,110,111 పోలింగ్ కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. ప్రతి ఒక్క పోలింగ్ బూత్‌ను తనిఖీ చేసి, అక్కడ ఎంతమంది సిబ్బందిని నియ మించాలి? ఏఏ స్థానాల్లో విధులు కేటాయించాలో ముందుగా సిద్ధం చేసుకునేలా వుండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కుర్చీలు, టేబుల్స్, లైటింగ్, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు అన్ని వుండేలా చూసు కోవాలన్నారు. తాగునీరు ఏర్పాట్లు, బాత్ రూములు ఏర్పాటు, వికలాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులు వుండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి సమస్యలు రాకుండా వుండేందుకు తగు చర్యలు చేపట్టాలని తిరుపతి ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అదనపు రిటర్నింగ్ ఆఫీసర్లు తిరుపతి అర్బన్ ఎమ్మార్వో వెంకట సూర్యనారాయణ రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ద్వారకనాథ రెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్‌కు గేటు రుసుం రద్దు చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని ఆటో వర్కర్స్‌కు గేటు రుసుం వసూలు చేయడాన్ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ మున్సిపల్ మేనేజర్ కి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని ఏ మున్సిపాల్టీ, కార్పొరేషన్‌లోనూ గేటు రుసుం వసూలు చేయడం లేదని పుత్తూరులో మాత్రం గేటు రుసుం వసూలు చేయడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడే ఆటో వర్కర్స్ బిఏలు డిగ్రీ చదువుకొని ఉద్యోగం లేక జీవనం కోసం ఆటో తీప్పుకుంటున్నారని, ఓ పక్క పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిపోతుంటే, ఆర్టీవో, పోలీసులు ఫైన్ లేస్తున్నారని దీనికి తోడు మున్సిపాలిటీ వారు గేటు రుసుం వసూలు చేయడం తగదన్నారు. గతంలో పది రూపాయలు ఉంటే 2024 టెండర్లలో ఆటోకి రూ.20కు పెంచుతామని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. పది రూపాయలు కట్టలేక ఇబ్బంది పడుతుంటే ఇంకా పెంచడం దారుణ మన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి టెండర్లను రద్దు చేయాలని లేని పక్షంలో మున్సిపల్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి భాస్కర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, ఏషియన్ బాష, బాబు, చంటి , పి కృష్ణయ్య, ధన పాల్గొన్నారు.

గేటు రుసుం రద్దు చేయాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు, ఆటో వర్కర్లు

ఘనంగా టాలెంట్ ఫెస్టివల్

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈ నెల 28 వ తేదీ నుంచి ప్రారంభమైన 2వ అఖిల భారతీయ సంస్కృత విద్యార్థుల ప్రతిభ సమారోహం–24 భాగంగా మూడవ రోజు శనివారం వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రస ప్రశ్న పోటీ (సంస్కృత క్విజ్), మూడవ రోజు టాలెంట్ ఫెస్టివల్ లో భాగంగా శనివారం రసప్రశ్న సంస్కృత క్విజ్ ను విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ క్విజ్ పోటీ ఆద్యంతం బాగా ఆకట్టుకుంది. వివిధ శాస్త్రాల్లో ఉన్న రకరకాల ప్రశ్నలను క్విజ్ మాస్టర్ ప్రొఫెసర్ సి. రంగనాథన్, డాక్టర్ భరత్ భూషణ్ కలిసి చక్కటి ప్రశ్నలతో విద్యార్థుల మేధాశక్తిని పరీక్షించే విధంగా నిర్వహించారు.

శాస్త్రభాషణ పోటీలు

ఉదయం 8 గంటల నుండి వివిధ శాస్త్రాలలో వేదాంతం–పురాణేతిహాస–ధర్మ శాస్త్రం– మొదలైన వాటిల్లో భాషణం, సమస్యను పూరించే సమస్య పూర్తి స్పర్ధ, సంస్కృత విద్యార్థులకు టెక్నికల్ గా ఉన్న జ్ఞానాన్ని పరీక్షించడం కోసం సాంస్క్రిట్ టెక్నికల్ కాంపిటీషన్ కూడా నిర్వహించారు. వీటన్నిటికీ ఛైర్ పర్సన్ గా ప్రొ.కె. గణపతి భట్, కన్వీనర్ గా డా.యశస్వి వ్యవహరించారు. ఈ పోటీల్లో విద్యార్థులు వారి వారి శాస్త్రంలో, వారు అభ్యసించిన జ్ఞానం ఏదైతే ఉందో ఆ జ్ఞానాన్ని వారు ఇచ్చిన అంశం పైన మాట్లాడి, విషయాన్ని ప్రతిపాదించారు.

బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు

మూడో రోజులో భాగంగా ఉదయం నుంచి విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీల ఫైనల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయం వైస్ ఛాన్స లర్ ప్రొ.జి.యస్.ఆర్ కృష్ణమూర్తి, స్టూడెంట్స్ దీని వెల్ఫేర్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ వచ్చి ఫైనల్ ఆటోమేటిక్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ పోటీలను స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.సేతురామ్ నిర్వహించారు.

సాంస్కృతిక పోటీలు

సాయంకాలం 6 గంటల నుండి విశ్వవిద్యాలయం ఎస్వీ రఘునాథచార్య ఓపెన్ ఆడిటోరియంలో సంస్కృత భారతీయ లోకనృత్య స్పర్ధ (ఇండియన్ ఫోక్ డాన్స్ కాంపిటీషన్) పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా వివిధ విశ్వవిద్యాలయ విద్యార్థుల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఛైర్‌సర్పన్ గా ప్రొ నారాయణ, కన్వీనర్గా డా లీనా చంద్ర వ్యవహరించారు. ఈ రెండవ అఖిల భారతీయ సంస్కృత విద్యార్థుల ప్రతిభ సమారోహానికి కోఆర్డినేటర్ గా డా.ఎం.జి నందన్ రావు, అడిషనల్ కోఆర్డినేటర్‌గా డా.ఎం.దత్తాత్రేయ శర్మ వ్యవహరించి ముందుకు నడిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి నాయకుని ఎన్నుకుని అభివృద్ధి మార్గంలో నడపాలి..

- చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి -కోట : ఈ ఎన్నికల్లో మంచి నాయకుడుని ఎన్నుకుని అభివృద్ధి మార్గంలో నడపాలని గూడూరు డివిజన్ యూత్ ప్రెసిడెం ట్ చిల్లకూరు సాయి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాబలం ముందు పొత్తుల బలం చిత్తవ్వాల్సిందేనని టీడీపీ ఉమ్మడి పార్టీలను ఆయన ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల మహా యుద్ధంలో తామంతా సిద్ధంగా ఉన్నామని, ఈ యుద్ధంలో తమ బలం ప్రజలే అని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో ఆలోచించి వైసీపీ విజయానికి కృషి చేస్తే భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు పొంద వచ్చున్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు.

'అబాకస్ మెగా సమ్మర్ క్యాంప్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక బైరాగిపట్టెడ ఆర్చి సమీపంలో నూతనంగా ప్రారంభించిన 'వీక్ష ద స్కూల్' లో ఆర్‌కె అబాకస్ మెగా సమ్మర్ క్యాంప్ వాల్ పోస్టర్స్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కె. అబాకస్ ఫౌండర్ డాక్టర్ తాతిరెడ్డి రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవి కాలాన్ని వృథా చేయకుండా గణితంపైన అవగాహనను, అబాకస్ శిక్షణలో మెళకువలను నేర్చుకుని, గణితం అంటే భయాన్ని వీడి, గణితంపై పట్టు సాధించి, భవిష్యత్తులో చాలా రకాల కాంపిటేటివ్ పరీక్షలను అత్యంత సులభంగా రాయటానికి అబాకస్ ముఖ్యమని తెలిపారు. అబాకస్ విద్య గురి చూసి ర్యాంకులను పట్టే విలువిద్య లాంటిదని, ఈ విద్య ద్వారా సైనిక్, నవోదయ, బ్యాంకు తదితర కాంపిటేటివ్ పరీక్షలకు కష్టపడకుండా గణితంపై పట్టుతో సాధించవచ్చునని ఎస్వీ ఐటిఐ డైరెక్టర్ ఓమ్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.వి.ప్రేమానంద రెడ్డి, అన్నమయ్య డాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ బాబు తెలిపారు. ఈ అవిష్కరణలో భవిష్య అకాడమి డైరెక్టర్ వి.వాసుదేవ రెడ్డి, రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్.కె. అబాకస్ సంస్థ డైరెక్టర్ ఆర్.కె.విమలారెడ్డి మాట్లాడుతూ ఎం.ఆర్.పల్లి మెయిన్ బ్రాంచి, అన్నారావు సర్కిల్ లో ఉన్న బ్రాంచులలో కూడా మెగా సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిని ప్రతి ఒక్క విద్యార్థి వారి భవిష్యత్ దృష్ట్యా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి బ్యాచ్ ఏప్రిల్ 5వ తేదిన, 2వ బ్యాచ్ ఏప్రిల్ 14న, 3వ బ్యాచ్ ఏప్రిల్ 24న, 4వ బ్యాచ్ మే నెల 1వ తేదిన, 5వ బ్యాచ్ మే నెల 10వ తేదిన ప్రారంభమవుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 99895 00074, 73865 02450, 83319 38339 నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు. ఆర్.కె. అబాకస్ మెగా సమ్మర్ క్యాంప్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బాలికల సైనిక్ స్కూలు ఫలితాలలో 'విశ్వం' ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : కిట్టూరు బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం చిన్నారులు వంశిత శ్రీ, మనోజ్ఞ భాయ్, సోనిక, ధర్షిణి, నిత్య శ్రీ, వర్షిణి ఎంపిక అయారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టరు యన్.విశ్వ నాథ రెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలలోను జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో, అత్యధిక మార్కులతో విశ్వం చిన్నారులు ఎంపిక అవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలలో తమ సంస్థ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు వెల్లడిం చారు. ఎంపికైన చిన్నారులను విద్య సంస్థల కరస్పాండెంట్ యన్.తులసి విశ్వనాథ్, అకాడమిక్ డైరెక్టర్ యన్.విశ్వ చందన్ రెడ్డి అభినందించారు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు

బ్రిడ్జిపై వాహనం ఆపి వ్యాపారం

- ప్రమాదాలకు ఆస్కారం - స్పందించని అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పురపాలక సంఘం పరిధిలోని పెట్రోల్ బంక్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జిపై ట్రాక్టర్‌ను పార్కింగ్‌చేసి కర్బూజా పళ్ల వ్యాపారం చేసుకుంటున్నారు. అసలే ఇరుకుగా ప్రదేశం, ఇటు మార్కెట్‌కు వచ్చే వాళ్లు, బయట సొంత గ్రామాలకు వెళ్లే వాళ్లు అధికంగా వుంటారు. వారికి తోడు అదే ప్రాంతంలో రైల్వే స్టేషన్ కూడా వుండడంతో ప్రయాణికుల వాహనాలతో నిత్యం బ్రిడ్జి రద్దీగా వుంటుంది. ఇలాంటి ఇరుకు ప్రదేశంలో ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా వుంది. వాహనాల రాకపోకలు, జనం రద్దీగా వున్న ప్రాంతం బ్రిడ్జీపై పార్కింగ్‌చేసిన వాహనంలో వ్యాపారం చేసుకుంటు న్నా మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ అధికారు లు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుత్తూరు నుండి తిరుపతికి వెళ్లే వాహనాలు, తిరుపతి నుంచి పుత్తూరు లోపలికి వచ్చే వాహనాల రాకపోకలతో స్థలం చాలక ఇబ్బందు లు పడుతున్న సమయంలో అదే ప్రాంతంలో ట్రాక్టర్ నిలిపి వ్యాపారం చేసుకుంటుంటే ప్రమాదాలు చోటు చేసుకోవా?' అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీస్ శాఖ స్పందించి బ్రిడ్జి పైన ఎలాంటి వ్యాపారాలు, వాహనాలు ఆపకుండా తగిన చర్యలు తీసుకొని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జిపై వాహనం నిలిపి వ్యాపారం చేసుకుంటున్న దృశ్యం

వైసిపి ఎంపిటిసి, మాజీ సర్పంచ్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- నారాయణవనం:

నారాయణవనం మండలం బొప్పరాజుపాలెం వైసిపి ఎంపిటిసి ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ వెంకటేష్, సీనియర్ నాయకుడు సుబ్బరాయులు, మేస్ ఓనర్ శ్రీనివాసులుతో పాటు వంద కుటుంబాలు సత్యవేడు అసెంబ్లీ టిడిపి ఉమ్మడి అభ్యర్థి కోనేటి ఆదిమూలం సమక్షంలో శనివారం చేరారు. ఈ మునిరత్నం, కిరణ్ కుమార్, తులసి, సుభద్ర, గోవిందయ్య, నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, రవి, హరి, మాణిక్యం, శివకుమార్, గోవింద శెట్టి పాల్గొన్నారు.

ఆదిమూలం సమక్షంలో టిడిపిలో చేరిన కుటుంబాలు

ఏర్పేడు : ఏర్పేడు మండలం అంజిమేడు లో టిడిపి యువ నాయకులు కన్నలి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ బొడుగు శ్రీనివాసులు యాదవ్, వైసీపీ నుండి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అదే బాటలో అంజిమేడు దళితవాడకు చెందిన 73 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి.

ఫోర్జరీ సంతకాలతో ఇచ్చే ఇంటి పట్టాలను నమ్మొద్దు

శ్రీకాళహస్తి శాసనసభ్యులు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డి ఫోర్జరీ సంతకాలతో కూడిన ఇంటి పట్టాలను అసంతృప్తి నేతలకు అందిస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు జెడ్పిటిసి తిరుమలయ్య, శ్రీకాళహస్తి జెడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డి, అంజిమేడు ఎంపీటీసీ శ్రీనివాసులు యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు ధనంజయులు నాయుడు, మోహన్ నాయుడు, నాగరాజు నాయుడు, చెవిరెడ్డి గోపాల్ రెడ్డి, శివాజిరెడ్డి, అశ్వర్థామ, కుక్క శంకరయ్య, మోర తోటి సాంబయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిధిలోని నాలుగో వార్డుకు చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఉమ్మడి అభ్యర్థి పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో శనివారం చేరారు. గూడూరు పట్టణంలోని నాలుగో వార్డులో సునీల్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతానికి చెందిన సురేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ఎస్దాని, కాలేషా, నజీర్ , ప్రభాకర్ వారి అనుచరులతో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపిలో యువత చేరిక

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాల్టీ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు వైసిపి సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టా సుధాకర్ రెడ్డి, తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి.సంజీవయ్య, ఎన్‌డిసిసిబి ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి సమక్షంలో శనివారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్న జగనన్న ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండల వైసిపి కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి, సూళ్లూరుపేట ఎంపీపీ అనిల్‌రెడ్డి, చదలవాడ కుమార్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెంచయ్య, కటకం జయరామయ్య, నాయుడుపేట పట్టణ వైసిపి యువజన అధ్యక్షులు పాలేటి నాగార్జున, కౌన్సిలర్ పాపారెడ్డి చంద్రా రెడ్డి, పూడేరు సర్పంచ్ వెంకటే శ్వర్లు పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన యువకులు

క్రైం న్యూస్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం పానభకం రైల్వే స్టేషన్ సమీపంలో బైక్‌పై నుండి పడిపోయి శుక్రవారం చనిపోయినట్లు చంద్రగిరి సీఐ రామయ్య శనివారం తెలిపారు. బైక్‌పై నుండి పడిపోయి కాని, లేదా ఏదయినా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడం వల్ల కాని కిందపడి పడిపోయి మృతి చెంది ఉండవచ్చని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు. మృతుని వయసు సుమారు 30 సంవత్సరాలు ఉంటుం దని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే చంద్రగిరి సీఐ రామయ్య 9440796760 నెంబరుకు తెలపాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తిరుపతిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎస్ఆర్ పురం మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన ఈదల రవి(55) పుత్తూరు, తిరుపతి ప్రాంతాలలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య గీత, కుమారుడు బెంగుళూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎస్వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే రక్షణ దళం విశ్రాంతి కార్యాలయం ఎదుట చెట్టుకి ఉరి వేసుకొని ఈదెల రవి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల తో భార్యకు, అలిపిరి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అక్క మునిలక్ష్మికి సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని విద్యార్థి మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

పాఠశాల వద్ద తోటి స్నేహితులతో ఆడుకుని ఇంటికి వెళుతున్న విద్యార్థిని వాటర్ ట్యాంక్ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన వేలు నాగేశ్వరి దంపతులకు ముగ్గురు పిల్లలు వున్నారు. ఇద్దరు కవల మగ పిల్లలు, ఓ చిన్న పాప ఉంది. కుటుంబ పోషణ కోసం వేలు బెంగుళూరులో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. ఈ నేపథ్యంలో కవలల్లో ఒకరైన ఉమా మహేష్(10) శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో, తాను చదువుకుంటున్న పాఠశాల వద్ద స్నేహితులతో ఆడుకుని, సాయంత్రం ఇంటికి వెళుతున్న సమయంలో అటుగా వెళుతున్న వాటర్ ట్యాంకర్ ఢీకొంది. తీవ్ర గాయాలు పాలైన విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థి మృత దేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. శనివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘాట్ రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల ఘాట్‌రోడ్డులో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన దిగువ ఘాట్ రోడ్డులోని ఏనుగుల ఆర్చ్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. మృతురాలు బెంగళూరుకి చెందిన భావని(45)గా గుర్తించారు. శ్రీవారిని దర్శించుకొని తిరుగుప్రయాణంలో ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వారు వేగంగా వెళుతున్న కారు దిగువ ఘాట్ రోడ్డులోని ఏనుగుల ఆర్చ్ సమీపంలో అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు గాయాల పాలయ్యారు. బాధిత కుటుంబాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం: పులివర్తి వినీల్

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి):

చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, తన తండ్రి పులివర్తి నానికి అవకాశం ఇస్తే యువతకు ఉపాధి కల్పిస్తా రని భరోసా కల్పిస్తారని పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ అన్నారు. శనివారం ఆయన 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా చంద్రగిరి మండలం, ఏ రంగంపేట పంచాయతీలలో పర్యటించారు. వినీల్ ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యల్ని అడిగి తెలుసు కున్నారు. టిడిపి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, బెల్లంకొండ రమేష్, భూపతి,దేవిలాల్, సుబ్రహ్మణ్యం యాదవ్, వేణు రాయల్, పచ్చిపాల వెంకటరమణ, వేణుగోపాల్ రెడ్డి, పలని,వాసు రాయల్, చంగల్ రాయల్ ఆచారి, జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని టిడిపి మండల అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి కోరారు. శనివారం మండలంలోని నెత్తకుప్పంలో టిడిపి నూతన డివిజనల్ కార్యాలయం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్ ఆర్ కమ్మపల్లి , పుల్లమ్మ నాయుడు కండిగ, నెత్త కుప్పం, కొత్తవేప కుప్పం గ్రామ పంచాయతీలకు సంబంధించి నూతనంగా ఓట్లు నమోదు, తొలగింపులు, ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే తెలపాలని టిడిపి జిల్లా యువత కార్యదర్శి జెడి జగన్ కోరారు. ఈ కార్యక్రమంలో ఈ. ఉమాపతి నాయుడు, అయ్యా చిరంజీవి, ఆకా శ్రీనివాసులు, రదీష్, శేఖర్, చరణ్ తేజ, బి చిరంజీవి, ఓంకార్, నవీన్ పాల్గొన్నారు.

బాలాయపల్లి : మండలంలోని భైరవం గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా మాజీ గ్రామ సర్పంచ్ దాసరి రాజగోపాల్ నాయుడు, వ్యవసాయ మార్కె ట్ కమిటీ మాజీ ఛైర్మన్ దాసరి ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట గిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడు తూ వెంకటగిరి నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా కురుగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ విజయానికి కృషి చేయాలని కోరారు. గతంలో నియోజక వర్గంలో ఎన్నో అభివృద్ధి తెలిపారు. వైసిపి నుంచి దాసరి మురగయ్య మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యం లో ఆయన అనుచరులు 20 మంది చేరారు.

IN THE COURT OF THE IIIrd ADDITIONAL DISTRICT JUDGE : TIRUPATI
O.S.No.13 of 2015

Between
M/S.OR Distilleries, Gajulamandyam rep by its director Jetty.Sathish Kumar ....**Plaintiff**

AND
M/S.Prudential Sugar corporation ltd, by its chairman, Whole time director, Vinod Kumar Baid ....**Defendant**

NOTICE TO PLAINTIFF

M/S.OR Distilleries, Gajulamandyam rep by its director Jetty.Sathish Kumar, S/O Venkata Rao, Holding office at Plot No7and 8 I. D. A, Idustrial Estate, Gajulamandyam, Chittoor Dt Sir,

Please take notice that the petitioner/ Defendant filed chief affidavit of DW1, Order 18 Rule 17 petition in I.A.No.582/2023 Sec 151Cpc in I.A.No.581/2023, order 8 Rule 1[3] in I.A.No.767/2023, you shall appear either in person or your council on 8-4-2024, at 10:30 A.M. If you fail to do so case will be decided as per law.

SRI. D.DAMODAR REDDY,
SRI.V.KRISHNA REDDY,
ADVOCATES FOR DEFENDANT,
TIRUPATI.

IN THE COURT OF ADDL.JUNIOR CIVIL JUDGE-CUM-J.F.C.M::PUTTUR
O.S.No.38 / 2022

Between
CANARA BANK, PUTTUR BRANCH, Rep. by its Branch Manager, having holding his office K.N.Road, Puttur, Chittoor Dist., A.P. ....**Plaintiff**

AND
Mellapindi Akhil ....**Defendant**

SUMMONS TO THE DEFENDANT

Mellapindi Akhil, S/o. M.Ramu, Hindu, Aged about 26 years, Business, Residing at D.No.19-10-99-F3, New Indira Nagar, Near S.G.S,Arts College,Tirupati Town, Post & Urban Mandal, Tirupati Dist.,

Please take summons that, the plaintiff filed the suit for recovery of bank loan debt in the above Hon'ble Court against you and the above suit is posted to 12.04.2024 for your appearance. So, Please to be attend on 12.04.2024 at 10-30am before the above Hon'ble Court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.

This is the order of the above Hon'ble Court

Sd/-
Sri D.Damodar Reddy, B.A., B.L.,
Advocate, Puttur